# మంచు కరిగింది

**వీరభద్రరావ్ పమ్మి**

**ఆదిత్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చినప్పట్నుంచీ ఆ ఇంట్లో మళ్ళీ గొడవ మొదలైంది. వృద్ధ దంపతులిద్దరూ మళ్ళీ పోట్లాడుకోడంమొదలెట్టారు.**

**నీ ఆలోచన తప్పని వెంకటేశ్వర్లు**
**మీ ఆలోచన మహా తప్పని దుర్గమ్మా.**

ఉదయమూ, మధ్యాహ్నమూ, సాయంత్రమూ ఒకటే గొడవ. ఆమె ఆలోచనలని ఆయన అంగీకరించలేదు. ఆయన ఆలోచనని ఆవిడా సుతారం అంగీకరించలేదు.

''నువు ఏమైనా అనుకో పెద్దాడు వచ్చే టైంకి మనమంతా ఏర్‌పోర్టుకి వెళ్ళాల్సిందే. నేను ఈ ఇంటి యజమానిని. ఈ ఇంట్లో అంతా నా మాట వినాల్సిందే'' అని చివరకి వెంకటేశ్వర్లు తననిర్ణయం ప్రకటించేసాడు.

ఆవిడ ఏమీ మాట్లాడలేదు. లోపలికెళ్ళి కళ్ళ నీళ్ళు తుడుచుకుంది.

భార్య తన నిర్ణయం ఒప్పేసుకుందని వెంకటేశ్వర్లు మనసులో చాలా ఆనందపడ్డాడు.

ఆమె ఒప్పకోదేమో నా ఉప్పతింటున్నవాళ్ళు నా మాట వినాల్సిందే'' అని ఆటంబాంబులాంటి ఆ ఖరి వాక్యం ప్రకటిద్దామనుకున్నాడు. కానీ ఆ అవకాశం కలగలేదు.

ఆమె లోపకెళ్ళి ఆలోచించింది. మళ్ళీ ఆలోచించింది. మళ్ళీ మళ్ళీ ఆలోచించింది.

ఎన్నిసార్లు ఏ కోణంలోంచి ఆలోచించినా ఆమెకి తనపంథాయే సరైనదన్న భావం మళ్ళీ మళ్ళీ కలుగుతోంది.

భర్త ఆలోచనతో ఆమె ఏకీభవించలేక పోతోంది.

అసలు ప్రపంచంలో ఇన్ని శత్రుత్వాలు. ఇన్నిదుర్మార్గాలు, ఇన్ని యుద్ధాలు రెండు ఆలోచనల సంఘర్షణా ఫలితమే కదా!

పెద్దకొడుకు నాలుగేళ్ళ తర్వాత ఇండియాకి వస్తున్నాడంటే ఆమెకి ఉత్సాహంగా లేదు. పైపెచ్చు ఏదో నిరాశగా, నిరాసక్తంగా, గుబులుగా, దిగులుగా ఉంది.

ఇక ఎక్కువ సమయం లేదు. వారం రోజులు. వారం రోజుల్లో ఆదిత్య ఇండియాకి వస్తాడు.

ఆమె ఆలోచనలన్నీ ఆదిత్యచుట్టూ తిరగడం ప్రారంభించాయి. చిన్నప్పుడు బాగానే ఉండేవాడు. బాగా చదువుకునేవాడు. ఎంతో క్రమశిక్షణతో తల్లిదండ్రుల పట్ల గౌరవాభిమానాలతో ఓ పద్ధతిప్రకారం నడుచుకునేవాడు.

తనే ఓ పద్ధతి ప్రకారం అతన్ని పెంచి పెద్దచేసింది ''వీడు నా కొడుకు'' అని గర్వంగా నలుగురికీ చెప్పకునేంత గొప్పగా పెంచింది.

ఆ మాటకొస్తే ఇండియాలో ఉన్నన్నాళ్ళూ బాగానే ఉండేవాడు.

అమెరికా వెళ్ళాకనే ఇలా ముంచేసాడు.

అడ్డాలనాడు బిడ్డలుగానీ గడ్డాల నాడు బిడ్డలా అని అందుకే అంటారేమో—

ఆలోచనలు—

ఆలోచనల పొగలు—

ఆలోచనల సెగలు—

ఆలోచనల సర్పాలు—

ఆమె మనసు అశాంతిగా ఉంది.

ఎంత వద్దనుకున్నా ఆమె ఆలోచనలు రాబోయే కొడుకు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

ఎవర్ని ఇష్టపడమో వారినే ఎక్కువగా తల్చుకుంటాం. భగవంతుణ్ణి భక్తులకన్నా అయిన శత్రువులే ఎక్కువగా తల్చుకుంటారట ఇదేనేమో....

ఇహ ఆలోచనలన్నీ ఆపేసి ఏం చెయ్యాలో నిర్ణయించుకోవాలి అనుకుంది దుర్గమ్మ.

అలా అనుకున్నపుడు ఆమెకి ప్రశాంతంగా ఉంది.

** ** **

డాక్టరేట్ చేసిన ఆదిత్యకి ఢిల్లీలో మంచి ఉద్యోగం దొరికితే తల్లిదండ్రులు చాలా సంతోషించారు. కొడుకు బాగా చదువుకుని, బుద్ధిమంతుడై, మంచి జీతంతో, మంచి ఉద్యోగంలో చేరాడని సంతోషించారు.

''మంచి చదువు, మంచి ఉద్యోగం, మంచి జీతం, మంచి హోదా ఉన్నాయి. వాడినో ఇంటివాడిని చేస్తే మన బాధ్యత తీరుతుంది.'' అంది దుర్గమ్మ.

''ఆ అవును'' అన్నాడు వెంకటేశ్వర్లు.

తల్లిదండ్రుల్ని చూడ్డానికి ఆదిత్య ఇంటికి వస్తే ఆ విషయం అతనిదగ్గర కదిపారు.

అతను సరేనన్నాడు.

''ఒరేయ్ మా అన్నయ్య కూతురు మీనాక్షిని చేసుకో. పాపం తల్లిలేని పిల్ల. సవతితల్లి చేతిలో అష్ట కష్టాలు పడింది. బుద్ధిమంతురాలు. అందానికేం లోటు లేదు. చదువు పెద్దగా లేదుగానీ సంస్కారం ఉంది'' అంది దుర్గమ్మ.

''వాడి మనసులో ఏం ఊహలున్నాయో తెల్సుకోకుండా అలా అడిగేస్తావేం?'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''నేనేమీ బలవంతం చెయ్యడం లేదు. నా కెందుకో మీనాక్షిని మనింటి కోడలుగా తెచ్చుకోవాలని ఉంది. వాడికిష్టమైతే సరే లేకపోతే లేదు'' అంది.

ఆదిత్య మనసులో మీనాక్షి కదిలింది. అతనామెను చూసి చాలా కాలమైంది. ఎప్పుడో అతను బి.ఎస్సీ చదువుతున్న రోజుల్లో చూశాడు.

''సరే ఓ పనిచేద్దాం రేపు బల్దేరి మామయ్యగారి ఊరు వెళదాం. నేను మీనాక్షిని చూసి చాలా ఏళ్లైంది. పెళ్ళివిషయం నువ్వేం ఎత్తకు. రెండురోజులుందాం. మీనాక్షిని చూస్తాను. మాట్లాడ్తాను. ఓ అభిప్రాయం ఏర్పర్చుకుంటాను. నీకే విషయం ఇంటికి తిరిగి వచ్చాక చెప్తాను'' అన్నాడు ఆదిత్య.



అతని ప్రతిపాదన తల్లికి నచ్చింది.

తండ్రికూడా సరేనన్నాడు.

రిక్షా మేనమామ ఇల్లు ఉన్నవీధి మలుపు తిరుగుతుంటే 'నువ్వెట్టి పరిస్థితుల్లోను వాళ్ళతో పెళ్ళి విషయం ప్రస్తావించకు. ముందే ఆశపెట్టుకుంటే తీరా నేను చేసుకోనంటే నిరాశపడతారు'' తల్లిని హెచ్చరించాడు ఆదిత్య.

మేనమామ గారింట్లో ఉన్నరెండు రోజులు ఆదిత్య మీనాక్షిని గమనిస్తూనే ఉన్నాడు. ఇంటెడు పని ఆమె ఒక్కతే చేస్తుంది. మర్యాదగా ప్రవర్తిస్తుంది. ప్రతిమాట

లో సంస్కారం కనిపిస్తుంది. అన్నిటికీ మించి మేనత్త మీద బావమీద ఆమెచూపించిన ఆప్యాయత, ఆదరణ అద్భుతం.

ఇంటర్ చదువుతూనే మానేసిందన్న మాటే గానీ తెలివితేటలకి ఏమీ లోటులేదు.

మర్నాడు సాయంత్రం ఏరా రాత్రికి మన ఊరు వెడదామా?'' అని తల్లి అడిగితే 'రేపు పొద్దున్నే వెళ్ళిపోదాం' అన్నాడు ఆదిత్య.

మేనమామ అతని రాకకి పులకించి పోయాడు.



అతనిపట్ల ఎంతో ఆదరణ, ఆప్యాయత శ్రద్ధకనబర్చాడు

ఆ రెండో రోజు రాత్రి భోజనాలయ్యాక ఒంటరిగా దొరికిన మీనాక్షితో ''డాబా మీదకి రా నీతో మాట్లాడాలి'' అన్నాడు ఆదిత్య.

ఓ అరగంట పోయాక ఆమె డాబా మీదకి వచ్చింది. అతను పిట్టగోడనానుకుని సిగరెట్ కాల్చుకుంటున్నాడు. మెట్లు ఎక్కి వెన్నెల్లో చిన్న చిన్న అడుగులేసుకుంటూ నడిచి వస్తున్న మీనాక్షిని అతను తేరిపార చూశాడు

స్త్రీత్వం కదలి మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ తన దగ్గరకి వస్తున్నభావం కలిగింది.

''రేపుదయం వెళ్ళిపోతున్నారటగా?'' అందామె.

''అవును''

''మరో రెండురోజులుంటే బావుండేది. అసలేరాక రాక వచ్చావు. మళ్ళీ ఎన్నేళ్ళకొస్తావో'' అందామె.

''కాదు వెళ్ళాలి., రెండురోజుల్లో బైల్దేరి ఢిల్లీ వెళ్ళిపోవాలి. శెలవు ఆట్టే లేదు.

రేపు పెళ్ళయితే మళ్ళీ శెలవు కావాలి కదా?'' అన్నాడు.

''అవును సంబంధాలేమైనా చూశావా?'' అనడిగింది.

అంటే తను ఆమెను చేసుకుంటాడేమోనన్న ఆశపడటం లేదన్నమాట!

ఆమె అమాయకత్వానికి అతనికి ఆశ్చర్యం కలిగింది.

''అదేవిటి నాకు పెళ్ళికుదిరింది. నీకు తెలియదా?'

''తెలియదు. పిల్ల బావుంటుందా?''

''ఓ అద్భుతంగా ఉంటుంది. గొప్ప అందాల రాశి.. మల్లెపువ్వంత అందంగా ఉంటుంది.''

''బాగా చదువుకుందా?''

''ఏదో వానాకాలం చదువు అంత అందం ఉండగా, చదువెందుకు?''

''కట్నం ఎంత?''

''రెండు చేపకళ్ళు, ఓ కోటేరుముక్కు, చక్కటి వాల్జడ....''

''ఏ ఊరు భావా?''

''మీ ఊరే''

''మా ఊరా ఆ పిల్ల పేరేమిటి?''

''మీనాక్షి''

ఆకాశంలో ఎక్కడో ఓ పెద్ద మెరుపు మెరిసింది.

ఆమె మనస్సులాకాశంలో కూడా.....

*******

ఢిల్లీలో—

ఆదిత్య మీనాక్షికి రకరకాల ప్రదేశాలుచూపించాడు.

రాష్ట్రపతి భవన్ చూపించాడు. పార్లమెంట్ చూపించాడు. జూ చూపించాడు. బిర్లామందిర్ చూపించాడు.

ఒక్క సంవత్సరం దాంపత్య సౌఖ్యంలో స్వర్గం చూపించాడు.

ఆమె ఆనందపడింది. ఆశ్చర్యపడింది. తన అదృష్టానికి మురిసిపోయింది. ఆమె గుండె పొంగి పోయింది. వీలైనపుడల్లా పొంగినగుండెల మీద ఆదిత్యని సుఖపెట్టింది.

సంవత్సరంకాగానే అతనికి అమెరికాలో పెద్ద ఉద్యోగం వస్తే ఎంత సంతోషించిందో అంత దుఃఖించింది.

భర్త గొప్పవాడవుతున్నందుకు ఆనందం.

తనకి దూరమౌతాడేనని దుఖం...

ఆదిత్య అలా అమెరికా వెళ్ళగానే ఆమె ఇలా అత్తవారింటికి చేరింది.

తల్లికన్నా ప్రేమగా చూసుకునే అత్తగారు, తండ్రి లాంటి మామగారు.

ఒక్క అర్నెల్లు ఓపికపడితే భర్తదగ్గరికి వెళ్ళిపోవచ్చు అదే ఆశతో ఓపికగా ఎదురు చూస్తోంది.

అమెరికా వెళ్ళిన మొదట్లో ఆమెకు ఎంతో ప్రీతిగా ఆప్యాయంగా ఉత్తరాలురాశాడు. నువ్వు లేకుండా జీవితం బాగా లేద్నాడు. నువ్వెప్పుడొస్తావోనని ఎదురు చూస్తున్నానన్నాడు.

రానురాను ఆమెకు ఉత్తరాలు రాయడం మానేశాడు. ఆమెకి అతనిలో ఏదో ఘోరమైన మార్పుకనిపించింది. ఆమె భయపడింది. బాధపడింది.

క్షేమం తెలుపుతూ తండ్రికి మాత్రం రాసేవాడు అందులో ఆమె ప్రస్తావన ఉండేదికాదు.

ఆమెకేదో అనుమానం పట్టుకుంది ఓ రోజు బాధ ఎక్కువై తట్టుకోలేక గట్టిగా ఏడ్చింది. అత్తగారు కంగారుపడి అసలు విషయం అడిగింది.

ఏడుస్తూనే మీనాక్షి అంతా చెప్పింది.

వెంటనే దుర్గమ్మకొడుక్కి ఉత్తరం రాసింది.

'నువ్వు మీనాక్షికి ఉత్తరాలురాయడం మానేశావట. అది బెంగపడుతోంది. వెంటనే దానికి ఉత్తరంరాయి''

నెలరోజులకి జాబువచ్చింది. మీనాక్షికి కాదు తల్లికి.

ఆ ఉత్తరం ఆ ఇంట్లో అందరి మనసుల్లోను ఉరుములు, మెరుపులు, పిడుగులు, భూకంపాలు, అగ్ని పర్వతాలు సృష్టించింది.

మీనాక్షి అయితే తల్లడిల్లిపోయింది. ఆమెకి జీవితం నిస్సారంగా ఘోరమైన మోసంలా కనిపించింది. అతని ఉత్తరం మళ్ళీమళ్ళీ చదివింది.

''అమెరికా వచ్చాక మీనాక్షిని చేసుకుని ఎంత తప్పు చేశానో అర్థం అయింది. ఇక్కడంతా చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూ మగాళ్ళతో అన్నిరంగాల్లో పోటీచేసే ఆడాళ్ళు కనిపిస్తారు.

నేను చేస్తున్న రీసెర్చివర్కులో నాకు సాయపడుతూ నా మనసుకి దగ్గరైన అమెరికన్ యువతిని నేను పెళ్ళిచేసుకున్నాను.

మీనాక్షికి అన్యాయం చెయ్యను. త్వరలో రెండులక్షల రూపాయలు ఆమె పేరుమీద పంపిస్తున్నాను. ఆ డబ్బు

తో ఆమెజీవితం సుఖంగా గడుస్తుందని తలుస్తాను. కావాలంటే ఇంకా డబ్బుపంపిస్తాను''

మోసపోయిన తన జీవితపు ఒడిలో రెండు కన్నీటి చుక్కలు రాలుస్తున్నట్లుగా రెండులక్షలు

ఆమెకి నవ్వు ఏడుపూ ఒకేసారి వచ్చాయి. సవతి తల్లి చేతిలో కష్టాలు పడిపడి, జీవితంలో మొదటిసారిగా సుఖాల వంతెనమీదకి చేరుకున్నానని తృప్తిపడుతుండగా ఆ వంతెన కూలిపోయింది.

ఆదిత్య చేసినపనికి మీనాక్షి కన్నా అతని తల్లి దుర్గమ్మ ఎక్కువ బాధపడింది.

అంత చదువు, సంస్కారం ఉన్నవాడు ఎంతదుర్మార్గంగా ప్రవర్తించాడు అనుకుంది.

బుద్ధిమంతుడనుకున్నకొడుక్కి పిదపకాలంబుద్ధు లొచ్చాయి అనుకుంది.

తన ఖర్మకి వగచి వగచి ఏడ్చి ఏడ్చి మీనాక్షి చివరి ఓ నిర్ణయం తీసుకుంది.

''అత్తయ్యా నాకాయన డబ్బు వద్దు. నేను చదువుకుంటాను. కొంచెం అన్నంపెట్టి, కొద్దిగా డబ్బులిచ్చి నన్ను చదివించు. చదువుకున్నాక నా దారేదో నేను చూసుకుంటాను'' అని ఘొల్లుమంది.

మూడేళ్ళలో బిఏ పాసైంది. ఆ ఊళ్లోనే ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కూడా దొరికింది. తనకి పెళ్ళైందని ఆ మనిషి అమెరికా ఉన్నాడని ఆమె పూర్తిగా మర్చిపోయింది.

కొడుకుచేసిన తప్పును దుర్గమ్మ క్షమించలేకపోయింది. మళ్ళీ కొడుక్కి ఎపుడూ ఉత్తరం రాయలేదు. అసలతని మాటే ఎత్తలేదు.

తండ్రి మాత్రం మొదట్లో కొంచెం బాధపడ్డా మెల్లగా మానసికంగా సర్దుకున్నాడు.

ఇండియా వదిలి వెళ్ళిన నాలుగేళ్లతర్వాత మొదటిసారి ఆదిత్య ఇంటికి వస్తున్నాడు.

ఆ ఇంట్లో రభస కంతటికీ అదేకారణం. ఆదిత్య ఇంటికి వస్తున్నాడన్న విషయం తెలియగానే మీనాక్షి మనసులో ఏదో జుగుప్స, అసహ్యం పేరుకున్నాయి. చిన్నప్పట్నుంచి సుఖం ఏమిటో అదెలా ఉంటుందో తెలియకుండా పెరిగింది.

ఇంటెడు చాకిరీ చెయ్యడం, సవతి తల్లిచేత తిట్లు తినడం, హమ్మయ్య ఈ రోజు గడిచింది అనుకోడం ఆమె పూర్వపు దినచర్య.

జీవితంలో వెలుగుంటుందని వెన్నెలుంటుందని, సుఖం ఉంటుందని, ఆనందం ఉంటుందని తెలియచేసిన వాడు ఆదిత్య. అయ్యో ఈ రోజుగడిచిపోతోంది అని ఆలోచించే స్థితికి ఆమెను తీసుకు వచ్చాడు.

ఒక్కసారి జీవితంలో ఆనందాన్నంతా మడిచేసి జేబులో పెట్టేసుకుని చీకటిమిగిల్చి వెళ్ళిపోయాడు.

అతను తన జీవితంతో ఆడుకున్నాడు.

ఘోరంగా ఆడుకుని మోసం చేశాడు.

చెట్టుకింద కూర్చుని మూడుముక్కలాట ఆడే మనిషి రోడ్‌మీద వెళ్ళే మనుషుల్ని మోసం చేసినంత ఘోరంగా ప్రవర్తించాడు.

అసలతను తన జీవితంలోకి ప్రవేశించకుండాఉంటే ఏమో జీవితం ఎటుతీసికెళ్తే అటువెళ్లి సరిపెట్టుకునేది.

అలాంటిది?

మీనాక్షి మనసు నిండా ఆదిత్య పట్ల అసహ్యం, అన్నం తింటూ పేడలో పురుగుని తల్చుకుంటే కలిగే అసహ్యం.

ఆమె దృష్టిలో తల్లి,తండ్రి, స్నేహితురాలు, దైవం అన్నీ అత్తగారు. ఆమె ఒక్కతే మానసికంగా తనని సమర్ధిస్తున్న మనిషి—

''అత్తయ్యా మీ అబ్బాయి వచ్చే సమయానికి నేనీ ఇంట్లో ఉండదల్చుకోలేదు. అతనికి నా ముఖం చూపించడానికి ఇష్టం లేకకాదు. అసలతని మొహం చూడటం ఇష్టంలేక. నేను, నాతో కలిసి పనిచేస్తున్న రేవతి గదిలో ఉండదల్చుకున్నాను. రేపే నా సామాను తీసుకొని అక్కడికి వెళ్ళిపోతున్నాను'' అంది.

దుర్గమ్మ ఆమె మనసుని పూర్తిగా అర్థంచేసుకుంది. అలాగే వెళ్ళు, అంది.

విషయంవిన్న వెంకటేశ్వర్లు కొంచెం బాధపడ్డాడు. 'ఆడపిల్ల అలా బైట ఉండటం మంచిది కాదు' అందామనుకున్నాడు కానీ—

''మొగపిల్లాడు అలా ప్రవర్తిస్తే ఏం చెయ్యగలిగారు?'' అని మీనాక్షి అడుగుతుందేమోని భయపడ్డాడు.

మీనాక్షి ఇంట్లోంచి వెళ్ళిపోయింది.

అంతే ఆ మర్నాటి నుండి ఆ ఇంట్లో మొగుడు పెళ్ళాల మధ్య రభస ప్రారంభమైంది.

మీనాక్షిపట్ల అంత క్రూరంగా ప్రవర్తించిన మనిషిని ఆదరించే మనసు తనకి లేదంటుంది దుర్గమ్మ.

అతనుతప్పుచేసిన మాట వాస్తవమే అయినా ఎంతైనా అతను తమ కొడుకు కాబట్టి సర్దుకుపోక తప్పదు అంటాడు వెంకటేశ్వర్లు.

రోజూ ఇదే గొడవ.

''అసలా దరిద్రుడు ఇండియాకి రాకుండా ఉంటే చాలు సంతోషించేదాన్ని.'' అంది దుర్గమ్మ.

ఆవిడ మాటలు భర్తకి రుచించలేదు.

''అసలు నువ్వే ఆ పల్లెటూరి పిల్లని వాడికి కట్టబెట్టావు. ఈ వేళ వాణ్నని ఏం లాభం?'' అన్నాడు వెంకటేశ్వర్లు.

బస్— అంతే!

దుర్గమ్మ మనసులో అంతవరకు ఉన్న అనిశ్చిత పరిస్థితి తొలగి పోయింది. మబ్బులువిడిపోయాయి. అంతవరకు పెండ్యులమ్‌లా ఊగుతున్న మనసు ఓ చోట స్థిరంగా నిలబడింది.

మగాడి దుర్మార్గాన్ని మరో మగాడు సమర్థించే పరిస్థితిమీద అసహ్యంపుట్టింది.

ఆమె వెంటనే ఓ నిర్ణయానికి వచ్చింది.

** ** **

ఆ రోజు—


ఉదయమే వెంకటేశ్వర్లు నిద్రలేచాడు. త్వరగా తెమిలి భార్యతోసహా ఏర్‌పోర్టుకి వెళ్ళి కొడుకుని రిసీవ్ చేసుకోవాలి.

ఇల్లంతా వెతికాడు. భార్య కనబళ్ళేదు. రేడియో దగ్గర చిన్న కాగితం కనబడింది.

''భార్యపట్ల దుర్మార్గంగా ప్రవర్తించిన ఆదిత్యని, వాణ్ని సమర్థిస్తున్న మిమ్మల్ని ఇద్దర్నీ క్షమించలేను. మీనాక్షి దగ్గరకెళ్ళిపోతున్నాను''

వెంకేశ్వర్లు పక్కనే ఉన్న కుర్చీలో కుప్పలా కూలిపోయాడు.

## ''గణపతి ప్రతిమలు''



గణపతి విగ్రహాలు రకరకాలుగా దొరుకుతాయి.కొన్ని మట్టితో చేసినవి మరికొన్ని గంధపు చెక్కతో చేసినవి, వెండితో చేసినవి మరి కొన్ని. అయితే ఒక్కొక్క ప్రత్యేక ఫలితం కోసం ఒక్కోరకమైన గణపతిని ధ్యానించాల్సి ఉంది.

ఓ వ్యక్తి తన ఆయుర్దాయం గురించి కంగారుపడుతున్నప్పుడు అతను కొయ్యలేదా మట్టితో తయారు చేసిన వినాయకుడిని నిత్యమూ ధ్యానించటం మంచిది. అది మంచి ఆయుర్దాయాన్నిస్తుంది. గంధపుచెక్కతో చెక్కిన వినాయకుని విగ్రహాన్ని పూజించటం వల్ల భోగ భాగ్యాలు పెరుగుతాయి. విరోధులను జయించటం కోసం మట్టితో తయారైన గణపతికానీ గంధపు చెక్కతో చెక్కిన ప్రతిమకానీ లేదా తెల్లజిల్లేడుతో తయారైన గణపతిని కానీ పూజించాలి. పూర్వకాలంలో రాజులు అలా చేసేవారు. పగడంలో చెక్కిన గణపతిని పూజించటంవల్ల, మెడలో ధరించటంవల్లకాంపిటేషన్లలో జయం ఇవ్వటంతోపాటు అనారోగ్యాన్ని చక్కదిద్దుతుంది. సామాన్యంగా ధనవంతులకు ఆరోగ్యం సరిగా ఉండదు. వాళ్ళు పగడంతో చేసిన గణపతిని కానీ బంగారపు ప్రతిమనుకానీ ధరించటం చాలా మంచిది. దీర్ఘవ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు పగడంతో చేసిన ప్రతిమను ధరించడం వల్ల ఆరోగ్యవంతులవుతారు. వెండి గణపతి ప్రతిమ సంఘంలో పేరు ప్రతిష్ట గౌరవాల్ని పెంపొందిస్తుంది.సన్మానాలు చేయిస్తుంది. రాగి గణపతి ప్రతిమను ధ్యానించటం మూలంగా పిల్లలు లేనివారికి పిల్లలు కలుగుతారు. రాతితో చెక్కిన గణపతిని పూజించటం మూలంగా పొలాలు, ఇళ్ళ స్థలాలు కొనగల్గుతారు.

పంచలోహాలతో చేసిన విగ్రహము జీవితంలో అన్ని సుఖాలను ఇచ్చి కోరికలను తీరుస్తుంది.

గణపతి ప్రతిమ మాత్రంచెడిపోకూడదు.'మూర్తి' స్వచ్ఛంగా ఉండాలి. చిల్లులు అవీ పడకుండా కాపాడుకోవాలి. ఆ విధంగా రకరకాల కోరికలకు రకరకాల గణపతి ధ్యానం ఉపయోగపడుతుంది.

—పొదిలి శ్రీరామమూర్తి